# సంపాదకీయం

బుధవారం 12-04-2023

## డిజిటల్ ఇండియా...

### నెలలో 800 కోట్ల లావాదేవీలు

డిజిటల్ చెల్లింపుల ఆవిష్కరణ భారత ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పును తీసుకొచ్చింది. పెద్దనోట్ల రద్దు తర్వాత ఆర్థిక లావాదేవీలన్నింటినీ పరివర్తన చెందించిన గొప్ప విప్లవ ఆవిష్కరణే ఈ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ. దేశీయంగా మొదలైన ఈ సరికొత్త సాంకేతిక వ్యవస్థ కోట్లాదిమందిని సాంప్రదాయిక ఆర్థిక వ్యవస్థ చట్రం నుంచి బయటకు లాగడమే కాదు... దేశీయ వాణిజ్యాన్ని పునర్నిర్మించింది.మన ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ఇది ఒక గేమ్ ఛేంజర్‌లా పనిచేసింది. ప్రజా జీవితంలో,బ్యాంకింగ్ రంగంలో, నగదు లావాదేవీల్లో సరికొత్త మార్పును తీసుకొచ్చిన భారతీయ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలందుకుంటోంది.ఆధునిక ఆర్థిక వ్యవస్థకు భారతదేశం అందించిన అధునాతన సాంకేతిక విప్లవం? డిజిటల్ పేమెంట్ సిస్టమ్. భారత్ రూపొందించిన దేశీయ తక్షణ చెల్లింపుల వ్యవస్థ వాణిజ్య కార్యకలాపాలను పునర్ని ర్మించడమే కాదు, కోట్లాదిమంది ప్రజలను సాంప్రదాయిక ఆర్థిక వ్యవస్థ నుంచి బయటపడేసింది.కేంద్ర ప్రభుత్వం దృఢమైన ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో దీన్ని రూపొందించింది. ఇది రోజువారీ జీవితాన్ని సౌకర్యవంతం చేసింది. రుణాలు, పొదుపులు వంటి బ్యాంకింగ్ సేవలను మరింతగా విస్తరింపజేసింది. కోట్లాది మంది భారతీయులకు ప్రభుత్వ కార్యక్రమాలను మరింతగా అందు బాటులోకి తీసుకొచ్చింది. పన్నుల సేకరణను కూడా సులభతరం చేసింది.ప్రధాని నరేంద్రమోదీ జీ20 ఆర్థిక మంత్రులతో ముచ్చటిస్తూ, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ పాలనను మౌలికంగానే మార్చివేసిందని చెప్పారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అతి తక్కువ ఖర్చుతో ఏర్పర్చిన సాంకేతిక ఆవిష్కరణగా చూడవచ్చు. దీంతో మునుపెన్నడూ కనీవినీ ఎరగని స్థాయిలో అభివృద్ధి చెందిన దేశాలను సైతం ఎలా ప్రభావితం చేయవచ్చో భారత్ నిరూపించింది.భారత్ ప్రారంభించిన ఈ గొప్ప ఆవిష్కరణ కేంద్ర భాగంలో 'జేఏఎమ్' త్రయం ఉన్నాయి. అవి: జన్ ధన్ ఖాతాలు, ఆధార్, మొబైల్. ఈ మూడు మూలస్తంభాలూ భారత ఆర్థిక పర్యావరణ వ్యవస్థను సమూలంగా విప్లవీకరించాయి.మొదటి స్తంభమైన ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన ప్రతి వయోజన భారతీయుడికి ఒక బ్యాంక్ ఖాతాను గ్యారంటీగా అందించే ఆర్థిక కార్యక్రమం. 2022 నాటికి, ఈ పథకం కింద 46.25 కోట్ల బ్యాంక్ ఖాతాలను తెరిచారు. వీటిలో 56 శాతం మహిళల ఖాతాలు కాగా, 67 శాతం ఖాతాలు గ్రామీణ, అర్ధ పట్టణ ప్రాంతాల్లో తెరిచారు. ఈ ఖాతాల్లో రూ. 1,73,954 కోట్లు జమ అయ్యాయి.ఇక రెండో మూలస్తంభం: ఆధార్ పరివర్తిత ఐడెంటిటీ సేవలు. ఆధార్ ఐడీని రెండు అంశాల ప్రామాణీకరణ లేదా బయోమెట్రిక్ ద్వారా ఉపయోగించవచ్చు. ఆధార్ ప్రామాణీకరణ బ్యాంకులు, టెల్కో వంటి సంస్థలకు మూలాధారంగా మారింది. దేశంలోని 99 శాతం వయోజనులు బయోమెట్రిక్ గుర్తింపు నంబర్‌ను కలిగి ఉన్నారు. ఇంతవరకు 1.3 బిలియన్ ఐడీలు జారీ అయ్యాయి. ఈ ఐడీలు బ్యాంక్ ఖాతాల రూపకల్పనను సరళతరం చేసి సత్వర చెల్లింపుల వ్యవస్థకు పునాదిగా మారాయి. ఇది భారతీయ టెలికామ్ రంగంలో కీలకమైన డిజిటల్ ఆవిష్కరణ. 2016లో రిలయెన్స్ జియో టెలికామ్ రంగంలోకి దూసుకొచ్చిన తర్వాత డేటా ఖర్చు 95 శాతం వరకు పడిపోయింది. ప్రతి భారతీయుడికి ఇంటర్నెట్‌ను అతి తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తెచ్చింది.ఈ?కామర్స్, ఫుడ్ డెలివరీ, ఓటీటీ కంటెంట్ వంటి సమాంతర వ్యవస్థలకు జీవం పోసింది. ఇంకా ముఖ్యమైనది ఏమిటంటే, అత్యంత మారుమూల ప్రాంతాల్లోని చిట్ట చివరి వ్యక్తికి కూడా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది.ఇంటర్నెట్ అందుబాటు, స్మార్ట్ ఫోన్ల వ్యాప్తిని టెలిఫోన్ కంపె నీలు వేగవంతం చేయడం; ఆధార్ ప్రామాణీకృత జన్ ధన్ ద్వారా భారతీయ చెల్లింపుల పర్యావరణ వ్యవస్థ సమూల మార్పునకు గురైంది. ఈ సమూల మార్పు బ్యాంక్ ఖాతాకు నగదు రహిత చెల్లింపులను అనుసంధానించే 'ఏకీకృత చెల్లింపుల మధ్యవర్తి' (యూపీఐ) భావనకు దారితీసింది.యూపీఐ ఒక ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) వ్యవస్థ. ఇది నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) నేతృత్వంలో పనిచేసే వేదిక. ఈ యేడాది జనవరిలో రెండు లక్షల కోట్ల రూపాయల విలువైన 800 కోట్ల లావాదేవీలు యూపీఐ ద్వారా జరిగాయి. ఈరోజు అన్ని రకాల చెల్లింపుల్లో 40 శాతం డిజిటల్‌గా జరుగుతున్నాయి. గత సంవత్సరం భారత్‌లో జరిగిన తక్షణ డిజిటల్ లావాదేవీల విలువ అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల మొత్తం డిజిటల్ లావాదేవీల కంటే ఎక్కువని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ జనవరిలో వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో తెలిపారు.దేశంలోని 30 కోట్లమంది వ్యక్తులు, 5 కోట్లమంది వర్తకులు యూపీఐని ఉపయోగిస్తున్నారని దిలీప్ అస్బె తెలిపారు. అత్యంత చిన్న లావాదేవీలను కూడా డిజిటల్ చెల్లింపుల ద్వారా చేస్తున్నారు. 10 రూపాయల విలువ చేసే కప్పు పాలు లేదా రూ.200 విలువ చేసే సంచీడు తాజా కూరగాయలు వంటి లావాదేవీలు కూడా డిజిటల్ ద్వారానే జరుగుతున్నాయి.సుదీర్ఘకాలంగా నగదు చెల్లింపులు సాగు తున్న ఆర్థికవ్యవస్థలో ఇది గణనీయమైన మార్పు. నల్లధనం నిర్మూ లనకు తీసుకొచ్చిన పెద్ద నోట్ల రద్దు, కోవిడ్ మహమ్మారి కాలంలో సామాజిక దూరం పాటించడం వంటివి కూడా డిజిటల్ పేమెంట్ వ్యవస్థను మరింతగా ముందుకు నెట్టాయి.భారత ప్రభుత్వం గోప్యత, సృజనాత్మక ఆవిష్కరణ మధ్య సరైన సమతూకాన్ని తీసుకొచ్చింది. వీటి ద్వారా ప్రతి చిన్న లావాదేవీ తర్వాత అమ్మకందారులు ఫోన్ మెసేజ్‌లు తనిఖీ చేస్తూ బిజీగా ఉంటున్నారు.క్యూఆర్ కోడ్ ద్వారా ప్రతి పేమెంట్‌తో తక్షణం అందుకునే డబ్బు ఎంతో సిరి వంటి వాయిస్ ప్రకటిస్తుంది. నగదు లావాదేవీలను దీర్ఘకాలంగా ఉపయోగిస్తున్న వర్తకులలో ఏర్పడే అవిశ్వాసాన్ని తొలగించడంలో ఇది సాయపడుతుంది.

# ఏపీలో స్టిక్కర్ వార్...



విజయవాడ, ఏప్రిల్ 11, ఆంధ్రప్రదేశ్‌లో వినూత్నంగా ప్రత్యేక కార్యక్రమానికి అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టింది. మా నమ్మకం నువ్వే జగన్ పేరుతో చేపట్టిన కార్యక్రమాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసన సభ్యులు, ఇంచార్జ్‌లు, నాయకులు జోష్‌తో నిర్వహిస్తున్నారు. జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా 'మెగా పీపుల్స్ సర్వే'కు అపూర్వ స్పందన లభించటంతో ఆ పార్టీకి చెందిన నాయకుల్లో ఉత్సాహం కనపడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజామద్దతు పుస్తకంలో 21 లక్షలకు పైగా కుటుంబాలు పాల్గొని సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమాభివృద్ధి పాలనకు సంబంధించి వారి స్పందనలను నమోదు చేశారు. ఇప్పటి వరకు జగనన్నకు మద్దతు తెలుపుతూ 82960-82960 నంబర్‌కు 15 లక్షల పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి అధికారికంగా ప్రకటించింది. ప్రజలకు గత ప్రభుత్వానికి ఇప్పటి ప్రభుత్వానికి తేడా తెలియ చేస్తూ ఐదు ప్రశ్నలు అడుగుతున్నారు. ప్రతి ఇంటికి వెళ్ళినపుడు వారి అనుమతితో జగన్ ఫోటో ఉన్న స్టిక్కర్ కూడా అంటిస్తున్నారు. నచ్చితే స్టిక్కర్ గోడకు అంటించుకోవచ్చు. అదే విధంగా సెల్ ఫోన్ పై కూడా అంటించే స్టిక్కర్ లను పంపిణి చేస్తున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన సర్వే కార్యక్రమంపై రాజకీయాల్లో చర్చనీయాశంగా మారింది. కోటి 60లక్షల ఇళ్ల దగ్గరకు వెళ్లి ప్రజల అభిప్రాయం తీసుకునే పనిలో ఉన్నారు వైఎస్ఆర్ కాంగ్రెస్ నేతలు. అధికార పార్టీకి చెందిన నాయకులు స్టిక్కర్‌ల పంపిణికి ప్రతిపక్షాలు కూడా కౌంటర్ కార్యక్రమాన్ని తలపెట్టాయి. మా ఖర్మ నువ్వే జగన్...మా కొద్దు జగన్ అంటూ పోటీ స్టిక్కర్‌లను కూడా పంపిణి చేస్తున్నాయి. జగన్ కు సంబంధించిన స్టిక్కర్ ఎక్కడ ఉన్నా.. దానికి పక్కనే ప్రతిపక్ష పార్టీకి చెందిన స్టిక్కర్‌ను వేసేస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం రాజకీయంగా చర్చనీయాశంగా మారింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూ కౌంటర్ స్టిక్కర్‌లు వేస్తున్నారు. జగన్ అధికారంలోకి వచ్చినప్పటి విఫలమైన అంశాలు, గంజాయి వంటి మత్తు పదార్ధాల రవాణా, శాంతి భద్రతల వైఫల్యాలు, జీవో నెంబర్ వన్ ను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు మండిపడుతున్నారు. అధికారంలో ఉండగా ఏమి చేయలేని తెలుగు దేశం పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పాలనలో సాధించిన విజయాలపై అక్కసు వెల్లగక్కుతోందని అంటున్నారు. ఇలాంటి ప్రచారం చేయటం దుర్మార్గమని ఆ పార్టికి చెందిన సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. సమానత్వం దిశగా అడుగులు వెయ్యడంలో సీఎం జగన్ నాలుగేళ్లు పూర్తి చేసుకున్నారని, సంతృప్తి చెందారు కాబట్టి ప్రజలు ఆశీస్సులు ఇస్తున్నారని అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదంతో వైఎస్ఆర్‌సీపీ లీడర్లు జనంలోకి వెళ్తుంటే మంచి స్పందన వస్తోందన్నారు. ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందించిందన్న విషయాన్ని గుర్తించారన్నారు. ఈ ఏడాది సంక్షేమ క్యాలెండర్ ఇప్పటికే జగన్ ప్రకటించారని, భవిష్యత్‌లో ఇది కొనసాగుతుందన్నారు. గత ప్రభుత్వం ఇప్పటి ప్రభుత్వానికి మధ్య తేడా గుర్తించే విధంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు.

## హీట్ పెంచుతున్న విశాఖ స్టీల్ ప్లాంట్..

విజయవాడ, ఏప్రిల్ 11,విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్వహణకు సంబంధించి ఆహ్వానించిన బిడ్డింగ్‌లో తెలంగాణ ప్రభుత్వం పాల్గొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. సింగరేణి లేదా రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ లేదా నీటిపారుదల శాఖ తరఫున పాల్గొనే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. విశాఖఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తమ వైఖరిని వెల్లడించడంతో పాటు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం, తెలంగాణలో చేపట్టిన మౌలికవసతుల ప్రాజెక్టులకు ఉక్కును సమకూర్చుకోవడం వంటి లక్ష్యాలతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదనల కోసం వెంటనే విశాఖపట్నం వెళ్లి అధ్యయనం చేయాలని ఉన్నతాధికారుల బృందాన్ని కేసీఆర్ ఆదేశించారని చెబుతున్నారు. విశాఖలో స్టీల్‌ప్లాంట్ కార్మికుల నిరసనల్లో బీఆర్ఎస్ ఏపీ నేతలు పాల్గొనడం కూడా ఈ ప్రచారానికి బలాన్ని చేకూరుస్తోంది..ఈ వార్తలపై ఏపీ ప్రభుత్వం ఆచితూచి స్పందిస్తోంది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయొద్దన్నది తమ స్టాండ్ అన్నారు ఏపీ పరిశ్రమలశాఖ మంత్రి అమర్నాథ్. స్టీల్ ప్లాంట్ పై మీడియాలో వస్తున్న వార్తలే తప్ప, ఇంతవరకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నుండి కానీ, తెలంగాణ ప్రభుత్వం నుండి గాని ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదన్నారాయన. అయితే, స్టీల్‌ప్లాంట్ బిడ్డింగ్‌లో తెలంగాణ సర్కార్ పాల్గొంటుందన్న వార్తలపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ కూడా స్పందించారు. ముందు నిజాం షుగర్ ఫ్యాక్టరీ, కాగజ్‌నగర్ పేపర్‌మిల్ తెరవాలన్నారు బండి. తెలంగాణ ప్రభుత్వం నిజంగా దీనిపై నిర్ణయం తీసుకుందా లేదా ఇదంతా ప్రచారమేనా అన్నది మరికొన్ని రోజుల్లో తేలనుంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ బిడ్డింగ్‌లో తెలంగాణ సర్కార్ పాల్గొంటుందన్న ప్రచారం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు ఆచితూచి స్పందించిన ఆంధ్రప్రదేశ్‌లోని అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకునే ప్రయత్నం తొలి దశ నుంచి వైసీపీ చేస్తోందన్నారు వైవీ సుబ్బారెడ్డి.. ప్రధాని వద్ద కూడా సీఎం జగన్మోహన్ రెడ్డి వైజాగ్ స్టీల్ ప్లాంట్ అంశాన్ని ప్రస్తావించారన్న ఆయన.. చట్టపరమైన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని స్టీల్ ప్లాంట్ కాపాడుకుంటాం.. వైజాగ్ స్టీల్ ప్లాంట్ గురించి ఇప్పుడు మాట్లాడుతున్న నాయకులు పార్టీలు ఇంత కాలం ఏం చేశాయి ? అని నిలదీశారు..

# ప్రాణాలు తీస్తున్న అక్రమ సంబంధాలు

కర్నూలు, ఏప్రిల్ 11,అసలే అతడికి భార్యపై అనుమానం. ఎలాగూ అనుమాన పడుతున్నాడని.. ఆమె మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలుసుకున్న భర్త వేధింపులు మరింత అధికం అయ్యాయి. దీంతో విసిగి వేసారిన భార్య ప్రియుడితో కలిసి భర్త హత్యకు ప్లాన్ చేసింది. పథకం ప్రకారం ఫుల్లుగా మద్యం తాగించి రైలు వచ్చే ముందు రైలు పట్టాలపై పడుకోబెట్టారు. ఈ క్రమంలోనే అతడి తల పూర్తిగా పగిలిపోయి అక్కడికక్కడే చనిపోయాడు. ఈ తర్వాత ఏమీ తెలియనట్లు భర్త కనిపించడం లేదని పోలీసులకు సమాచారం అందించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన 35 ఏళ్ల ఉప్పర నారాయణ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య వరలక్ష్మి కూడా ఉంది. అయితే కొంతకాలం నుంచి నారాయణ భార్య వరలక్ష్మిని అనుమానిస్తున్నాడు. ఈ క్రమంలోనే రోజూ ఫుల్లుగా మద్యం తాగి వచ్చి భార్యను శారీరకంగా, మానసికంగా హింసించేవాడు. అయితే భర్త వేధింపులు తాళలేని ఆమె.. సి.బెళగల్ మండలం మారందొడ్డి గ్రామానికి చెందిన చిన్న గోవిందుతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. తరచుగా అతడిని కలిసి తన సమస్యలు చెప్పుకునేది. అయితే భర్త వేధింపులు ఆగాలంటే అతడిని హత్య చేయడం ఒక్కటే దారి అని.. అతడితో కలిసి ప్లాన్ చేసింది. పథకం ప్రకారం చిన్న గోవిందు.. నారాయణను కర్నూలుకు తీసుకెళ్లాడు. ఫుల్లుగా మద్యం తాగించాడు. అనతరం అతడిని తీసుకెళ్లి రైలు పట్టాలపై పడుకో బెట్టాడు. ఈ క్రమంలోనే అతడి పైనుంచి రైలు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నారాయణ తల పగిలిపోయింది. తీవ్ర గాయాలై అక్కడికక్కడే చనిపోయాడు. చిన్నగోవిందు ఈ విషయాన్ని వరలక్ష్మికి ఫోన్ చేసి చెప్పాడు. మరుసటి రోజు అంటే గతేడాది జూన్ 30వ తేదీ తన భర్త కనిపించడం లేదని వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే వరలక్ష్మిపై కాస్త అనుమానం రావడంతో.. ఆమె సెల్ ఫోన్ కాల్స్ వివరాల ఆధారంగా పలువురిని అదుపులోకి తీసుకొని విచారించారు. భార్య వరలక్ష్మితో పాటు చిన్న గోవిందును గట్టిగా ప్రశ్నించగా.. తామే ఈ హత్య చేసినట్లు వెల్లడించారు. అయితే అనుమానంతో తాగొచ్చి వేధించడం వల్లే తాను భర్తను చంపాల్సి వచ్చినట్లు వరలక్ష్మి తెలిపింది. కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితులు ఇద్దర్నీ అరెస్ట్ చేసి ఎమ్మిగనూరు న్యాయస్థానంలో హాజరు పరిచారు. చిత్తూరు డీఎస్పీ శ్రీనివాస మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు నగరంలోని కొంగారెడ్డిపల్లె, విద్యానగర్ లోని ఓ అపార్ట్మెంట్లో ఢిల్లీ బాబు(48), అతని భార్య హేమలత(45)లు నివాసం ఉంటున్నారు. అయితే ఢిల్లీబాబు.. నెల్లూరు మండలంలోని గాండ్లపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పని చేస్తున్నాడు. హేమలత కొంగారెడ్డిలోని ఆర్కే మోడల్ స్కూల్ ప్రైవేట్ స్కూల్ లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. వీరి అన్యోన్య దాంపత్యానికి ప్రతీకలుగా ముగ్గురు కుమారులు ఉన్నారు. అయితే కొడుకులను ఉన్నత చదువులు చదివిస్తూ ఇంత కాలం వీరు హాయిగా జీవించారు. అయితే గత కొంత కాలంగా భార్య హేమలతపై ఢిల్లీ బాబు అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే ఆమెతో తరచుగా గొడవ పడుతున్నాడు. చిన్న చిన్న కారణాలకే భార్యను నోటికి వచ్చినట్లు దూషిస్తూ.. చిత్రహింసలు పెడుతున్నాడు. ఎవరితో మాట్లాడినా వారితో భార్యకు అక్రమ సంబంధాన్ని అంటగట్టేవాడు ఢిల్లీబాబు.హేమలత పని చేసే ప్రైవేటు స్కూల్ వద్ద కాపు కాసి మరీ ఆమెను మానసికంగా వేధించేవాడు. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో భార్యపై కక్ష పెంచుకున్న ఢిల్లిబాబు భార్యను హత్య చేసేందుకు పక్కాగా ప్లాన్ వేశాడు. అనుకున్న ప్లాన్ ప్రకారం శుక్రవారం సాయంత్రం ముగ్గురు కుమారులను బంధువుల ఇంటికి పంపాడు. ఆ తర్వాత భార్యపై కత్తితో దాడి చేసి అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. రక్తపు మడుగులో కొట్టుమిట్టులాడుతున్న భార్య చనిపోయేవరకు చూస్తూ పైశాచిక ఆనందం పొందిన ఢిల్లీ బాబు ఆతర్వాత తన మొబైల్ ఫోన్ ను స్విచ్ ఆఫ్ చేసి పరార్ అయ్యాడు. అయితే శనివారం ఉదయం ఎంతకీ బయటకు రాకపోయే సరికి అనుమానం వచ్చిన అపార్మెంట్ వాసులు వీరి ఇంట్లోకి వచ్చి చూశారు.చనిపోయి రక్తపుమడుగులో పడి ఉన్న హేమలతను చూసి భయపడిపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు.. కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం హేమలత మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుడు ఢిల్లీ బాబు కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ శ్రీనివాస మూర్తి వెల్లడించారు. అయితే తల్లి హత్య వార్త తెలుసుకున్న కుమారులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అనవసరంగా అనుమానం పెంచుకున్న తండ్రి.. తమకు అమ్మ లేకుండా చేశాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## హైకమాండ్ వైపే చూపులు

రాజమండ్రి, ఏప్రిల్ 11,బీజేపీలో పార్టీ అధ్యక్షుడి నిర్ణయమే కీలకమైనా ఢిల్లీ నుంచి వచ్చిన ఆదేశాలతోనే పార్టీ నడుస్తుంది. ప్రధానంగా ఇంతకు ముందులా కాదు. మోదీ, అమిత్ షాల నేతృత్వంలో రెండు సార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. ఈ కారణంగానే అభ్యర్థుల ఎంపిక నుంచి, మ్యానిఫెస్టో, పొత్తులతో పాటు ఆయా రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ఎంపిక కూడా వారి ఇద్దరి కనుసన్నల్లోనే జరుగుందన్నది యదార్థం. పార్టీ పొలిటి బ్యూరో అన్నది నామమాత్రమే. ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటిస్తారు. ఎన్నికలకు ముందు ఆ యా రాష్ట్రాల పరిస్థితులను అనుసరించి పొత్తులపై వారిద్దరే నిర్ణయం తీసుకుంటారు. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా ఉత్సవ విగ్రహమేనని చెప్పాలి. మోదీ, షాలు చెప్పినట్లు తలాడించడం వల్లనే ఆయనకు రెండోసారి పదవి రెన్యువల్ లభించిందనడంలో అతిశయోక్తి లేదు. కానీ ముందుగా శంఖంలో తీర్థం పోసిన చందంగా కొంత సంప్రదాయాలను పాటిస్తారు. పార్టీ అధ్యక్షుడితో మాట్లాడటం, ఆ తర్వాత నిర్ణయాలు తీసుకోవడం సాధారణంగా కమలం పార్టీలో జరుగుతుంటాయి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాజకీయ నిర్ణయాలను కూడా అంతే అనుకోవాలి. అందుకు భిన్నంగా ఉంటుందని చెప్పలేం. సోము వీర్రాజు చెప్పారని టీడీపీతో పొత్తు వద్దనుకోరు. చెప్పలేదని మానుకోరు. ఆ నిర్ణయం వారిద్దరిదే. ఫైనల్ డెసిషన్ వారి నుంచి రావాల్సిందే. కాకుంటే సోమును మూడు రోజులు ఢిల్లీకి పిలిపించి ఒక డ్రామాను సృష్టిస్తారు. ప్రజాస్వామ్యంగా నిర్ణయం తీసుకున్నామంటూ ప్రకటించుకుంటారు. అంతే తప్ప సోము వల్ల ఊడేదేం లేదు. తెగేది ఏమీ లేదు. కాకుంటే ఇక్కడ కొన్ని అనుమానాలు తలెత్తక మానదు. టీడీపీతో పొత్తు కావాలనుకుంటే కన్నా లక్ష్మీనారాయణ వెళుతుంటే ఆపేవారు. టీడీపీ అధినేత చంద్రబాబు నమ్మకమైన మిత్రుడు కాదని మోదీ, షాలు ఇద్దరూ ఒక నిర్ణయానికి వచ్చారు. బీజేపీ కేంద్ర నాయకత్వం ఆదేశాలను అనుసరించే సోము వీర్రాజు కూడా ఇక్కడ పనిచేస్తూ వస్తున్నారు. అంతే తప్ప తాను వ్యక్తిగతంగా చంద్రబాబుకు వ్యతిరేకి కాదు. అలా అని జగన్ ను కూడా సమర్థించలేదు. పార్టీని ఏపీ బలోపేతం చేయడం, భవిష?యత్‌లో కాషాయ జెండా ఎగరాలన్న కాంక్షతోనే కేంద్ర నాయకత్వం ఇచ్చిన సూచనలతో సోము టీం పనిచేస్తుందని చెప్పాలి. తాత్కాలిక ప్రయోజనాలను వారు ఆశించి నిర్ణయాలు తీసుకోరు. అందుకే కన్నా వంటి వారు విసిగిపోయి పార్టీ నుంచి వెళ్లిపోయారని చెప్పాలి.

# గన్నవరం నుంచి భారీగా కమలం ర్యాలీ

విజయవాడ, ఏప్రిల్ 11, ఇటీవలే భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరిన ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి రాష్ట్ర పర్యటనకు డేట్ ఫిక్స్ అయ్యింది. ఈనెల 12వ తేదీన ఆయన విజయవాడకు రానున్నారు. అదే సమయంలో పలువురు పారిశ్రామికవేత్తలు బీజేపీలో చేరేందుకు ప్లాన్ చేస్తున్నామని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి విజయవాడ కేంద్రంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయానికి రానున్నారు. అందులో భాగంగానే పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొనున్నారు. ఈ సందర్భంగా పలువురు పారిశ్రామిక వేత్తలు కిరణ్ కుమార్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి రాష్ట్రానికి చివరి ముఖ్యమంత్రిగా పని చేసిన కిరణ్ కుమార్ రెడ్డి ఇటీవల ఢిల్లీలో బీజేపీ పెద్దల సమక్షంలో కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఆయన రాకను పురస్కరించుకొని పార్టీ వర్గాలు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి పెద్ద ఎత్తున రోడ్ షో నిర్వహించటంతో పాటుగా, పలువురు సీనియర్ మాజీ నేతలను ఈ సందర్భంగా పార్టీలోకి ఆహ్వానించే కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో బీజేపీ ఆంధ్రప్రదేశ్ లో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఆదరణ కూడకట్టుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది.బీజేపీ అమలు చేసిన సంక్షేమ పథకాలు తామే అమలు చేసినట్లు ఏపీ సీఎం జగన్ ప్రచారం చేసుకుంటున్నారంటూ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణ మండిపడ్డారు. ఇప్పుడు ఏకంగా స్టిక్కర్లు వేసి ప్రజలను మాయ చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఆస్పత్రిలో ఐదు లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు ప్రధాని మోదీ అందించారని, అయితే రూపాయి ఇవ్వకుండా ఆరోగ్యశ్రీ పేరు పెట్టుకుని జగన్ స్టిక్కర్లను వేసుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఆరు వేలు ప్రధాని మోదీ ఇస్తే.. జగన్ రైతు భరోసా అని తన ఖాతాలో వేసుకున్నారని చెప్పారు. రేషన్ ఉచితంగా ఇస్తే.. ఇంటింటికీ బియ్యం అని స్టిక్కర్ వేశారని,



పేదలకు సొంతిల్లు మోదీ కట్టిస్తే.. జగన్ సొంత స్టిక్కర్లను వేసుకున్నారని అన్నారు. నేను ఉన్నాను, నేను విన్నాను అన్న జగన్... జనాలకు చేసిందేమీ లేదని విమర్శించారు.జాబ్ క్యాలెండర్ అని జగన్ గొప్పలు చెప్పుకున్నారని, జాబు లేదు, క్యాలెండర్ లేదని మండిపడ్డారు. డాబుగా స్టిక్కర్లను మాత్రం వేస్తున్నారని, ఉద్యోగులకు జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని విమర్శించారు. ఏ గ్రామానికి, పంచాయతీకి అయినా నిధులు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేంద్రం వేలకోట్లు ఇస్తే వాటిని మళ్లించారని, ఇప్పుడు ఎందుకు స్టిక్కర్లను వేస్తున్నారో... మీకు ఏ అర్హత ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో స్టిక్కర్ల ప్రభుత్వం నడుస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం వనరులను పూర్తిగా దోచేశారని ఆరోపించారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఆధ్వర్యంలో ఇసుక దోపిడీ వెలుగులోకి తెచ్చామని, అన్ని వనరులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చెందిన నాయకులు దోచుకోవడం నిజం కాదా అని ప్రశ్నించారు. మద్యం, మైనింగ్, ఇసుక మాఫియా ద్వారా రాష్ట్ర ఖజానాకు వెళ్లాల్సిన డబ్బు వారి సొంత జేబుల్లోకి ఎంత వెళుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. కుటుంబ పార్టీల వల్ల రాష్ట్రం అన్నివిధాలా దివాళా తీసిందని, రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టు అయినా ఎందుకు కట్టలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు.కేంద్రం ఇచ్చే డబ్బులతో పనులు చేస్తూ... గొప్పగా స్టిక్కర్లను వేసుకోవటం శోచనీయమని, జగన్ ప్రభుత్వం అవలంభించే ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. 2024 ఎన్నికలలో ఏపీలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి వంటి అనేక మంది సీనియర్ నాయకులు బీజేపీలోకి రావటం అభినందనీయం అన్నారు. బీజేపీలో చేరిన కిరణ్ కుమార్ రెడ్డి ఈ నెల 12 వ తేదీన విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయానికి వస్తారని తెలిపారు. బూత్ కమిటీ సమావేశాలు ద్వారా బీజేపీ బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. కుటుంబ, అవినీతి పార్టీ నుంచి ఏపీని కాపాడాలంటే బిజెపినే ప్రత్యామ్నాయ పార్టీగా అవతరిస్తోందని చెప్పారు.

## 19న పోర్టుకు శంకుస్థాపన

శ్రీకాకుళం, ఏప్రిల్ 11, మేజర్ ప్రాజెక్టులు శ్రీకాకుళం జిల్లాకు రావడం లేదనే ఆవేదన జిల్లావాసుల్లో ఉంది. దశాబ్దాలుగా భావనపాడు పోర్ట్ ఎన్నికల హామీగానే మిగిలింది.శ్రీకాకుళం జిల్లా ప్రజల దశాబ్దాల కల భావనపాడు పోర్టు నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఈనెల 19వ తేదీన మూలపేట పోర్ట్‌కు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. పోర్ట్ నిర్మాణం ద్వారా పారిశ్రామిక అభివృద్ధికి దొహదపడుతుంది. శ్రీకాకుళం జిల్లాకు తలమానికమైన ప్రాజెక్ట్ మూలపేట పోర్ట్‌తో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఏప్రిల్ 19 వతేదీన పోర్ట్‌తో పాటు వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ ప్రోజెక్ట్, బలసల రేవు వంతెనలకు సీఎం శంకుస్థాపన చెయనున్నారు.మరోవైపు ఇప్పటికే పోర్టుకు సంబంధించిన భూసేకరణ పూర్తయింది. పోర్టుకు అవసరమైన భూములను మూలపేట గ్రామంలో ఎకరాకు రూ. 25లక్షలు చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసింది.

# కారు ఢీకొని విద్యార్థిని దుర్మరణం

తిరుపతి తిరుపతి జిల్లా సత్యవేడు లో రోడ్డు ప్రమాదం జరిగింది. పుత్తూరు చెన్నై జాతీయ రహదారిలోని నారాయణవనం మండలకేంద్రం నుంచి భీముని చెరువుకు వెళ్లే మార్గంలోని రహదారిపై సైకిల్ పై వస్తున్న యువతిని కారు ఢీకొంది. ఘటన సమయంలో ఆమె ట్యూషన్ కి వెళ్లి సొంతూరు బ్రాహ్మణ తాగేల్పై పై వస్తుంది. మృతురాలు సౌమ్య నారాయణవనం బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతూ పరీక్షలు రాస్తున్నది. సౌమ్య రోడ్డు దాటే సమయంలో ఈ రోజు ఉదయం 7 గంటలకు కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో విద్యార్థిని దుర్మరణం చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు...

# వేడెక్కిన విజయవాడ

విజయవాడ మంగళవారం నాడు విజయవాడలో రాజకీయ వేడి పట్టింది. ఒకవైపు చలో విజయవాడ కార్యక్రమానికి వస్తున్న అఖిలపక్ష నేతల అరెస్టులను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ఖండించారు. సహ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చన్న మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి. ఇవాళ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా కాసేపట్లో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద నుంచి చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించారు. మరో వైపు ఇవాల్టి నుంచి ప్రభుత్వ ఉద్యోగులు సెల్ ఫోన్ డౌన్ కార్యక్రమం ప్రారంభం లయింది. తమ డిమాండ్ల సాధనకు మలిదశ ఉద్యమ కార్యాచరణకు ఉద్యోగులు సిద్ధమవుతున్నారు

# తిరుపతిలో పేకాడుతూ దొరికిపోయిన సీఐ, ఏఎస్సై అరెస్ట్

తిరుపతి ఓ ఇంట్లో కొందరితో కలిసి పేకాడుతున్న సీఐ, ఏఎస్సై సహా 13 మందిని తిరుపతి పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం రాత్రి వీరిని అరెస్ట్ చేయగా, రెండు రోజుల తర్వాత నిన్న వీరి అరెస్టును పోలీసులు వెల్లడించారు. తిరుపతి రూరల్ మండలం రాఘవేంద్రనగర్లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని దానిని కొందరు పేకాట స్థావరంగా మార్చేశారు. అందులో కొందరు పేకాడుతున్నట్టు సమాచారం అందుకున్న తిరుచానూరు పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ సీఐ, ఓ ఏఎస్సైతోపాటు మరో 11 మందిని అరెస్ట్ చేశారు. అలాగే వారి నుంచి భారీగా నగదు, కారు స్వాధీనం చేసుకున్నారు.పట్టుబడిన వారిలో పలువురు అధికార పార్టీ నేతలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ కారణంగానే వారి వివరాలను వెల్లడించలేదన్న విమర్శలు వచ్చాయి. ఎస్పీ పరమేశ్వరరెడ్డి జోక్యం చేసుకోవడంతో అదే రోజు రాత్రి పట్టణంలోని తూర్పు పోలీస్ స్టేషన్లో ఏఎస్సైగా పనిచేస్తున్న జోగారావు, కార్పొరేటర్ ఆంజనేయులు, మరో 9 మందిపై కేసులు నమోదు చేశారు.నిందితుల్లో నాగరాజు, డి.సురేశ్, కె.సురేష్, డి.కిరణ్ కుమార్, పి.కృష్ణారెడ్డి, బి.చెంచుమని, ఎన్.శ్రీనివాసులు, కె.మునిప్రసాద్, కె.రాధాకృష్ణ, కార్పొరేటర్ కె.ఆంజనేయులు, ఎస్.నరేంద్ర, ఏఎస్ఐ జోగారావు, సీఐ చంద్రశేఖర్లను నిందితులుగా చేర్చారు. మరో ఇద్దరు ప్రజా ప్రతినిధులను కేసు నుంచి తప్పించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి

# పోలీసులనుంచి తప్పించుకోవడానికి యత్నం

**పంటకాలువలో మునిగి వ్యక్తి మృతి**

కాకినాడ తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గుమ్ములూరు వద్ద తోటల్లో కోడిపందాలపై పోలీసులు దాడి జరిపారు. పోలీసుల రాకను గమనించిన అక్కడి వారు పరుగులు పెట్టారు. పోలీసుల దాడి నుంచి తప్పించుకునేందుకు పరుగు పెట్టిన వ్యక్తి మృతి చెందాడు. మహేష్ రాజా (31) పంటకాల్వలో దిగి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. ఒక కానిస్టేబుల్ మునిగిపోతున్న వ్యక్తిని కాపాడేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండాపోయింది. పోలీసులు మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానికులు, మృతుడి బంధువులు పోలీసుల తీరుపై మండిపడుతున్నారు.

# సంక్షేమ పథకాల ద్వారా భావి తరాలకు భరోసా

విశాఖపట్నం సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షే మ పథకాల ద్వారా భవిష్యత్ తరాల కు భరోసా ఇస్తున్నారని, అన్నివర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని ఉమ్మడి విశాఖ వైయస్‌ఆర్‌సీపీ రీజ నల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు అందిస్తుండడంతో జగనన్నే మా భవిష్యత్తు అంటూ ప్రజలు ముఖ్యమంత్రికి నీరాజనాలు పలుకుతున్నారని తెలిపారు.విశాఖ జిల్లా తాటిచెట్లపాలెం అభయ ఆంజ నేయస్వామి ఆలయం దగ్గర యువ జన విభాగం జిల్లా అధ్యక్షులు ఆళ్ల శివ గణేష్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవి ష్యత్తు పేరిట యువ రథంను వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం పలు ఇళ్లను దర్శించిన వైవీ సుబ్బారెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి వారి సమ స్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అంద జేశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బా రెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల సంక్షే మాన్ని దృష్టిలో ఉంచుకొని పథకాల రూపకల్పన చేశారని అందుకే ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతు న్నాయని తెలిపారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా గ్రామస్థా యిలోనే ప్రజల సమస్యలను తెలు సుకొని త్వరగా పరిష్కరించేలా చర్య లు తీసుకుంటున్నారని తెలిపారు.

# ఏపీలో ఈ పాఠశాల....

విజయవాడ, ఏప్రిల్ 11,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న సంస్కరణలు పాఠశాల విద్యకు కొత్త ఊపిరులు అందిస్తోంది. ఇప్పటికే బైజూస్ ద్వారా స్మార్ట్ ఫోన్లలో, ట్యాబ్ ద్వారా ఈ?కంటెంట్ అందిస్తున్న ప్రభుత్వం త్వరలో ఈ?పాఠశాలను ప్రవేశపెడుతోంది. ఇందులో భాగంగా ఎన్‌సీఈఆర్‌టీ ద్వారా 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఈ?కంటెంట్‌ను అందించనుంది. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ ప్రత్యేకంగా ఈ?పాఠశాల యాప్‌ను రూపొందిస్తోంది. ఈ కొత్త విధానం వచ్చే ఏడాది నుంచి అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, కింది తరగతుల్లో స్మార్ట్ టీవీల ద్వారా ప్రభుత్వం డిజిటల్ విద్యాబోధన అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ తరగతులకు అవసరమైన ఈ?కంటెంట్‌ను పూర్తి స్థాయిలో రూపొందించడానికి పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా 4వ తరగతి నుంచి ఈ?కంటెంట్‌ను సిద్ధం చేయిస్తోంది. విద్యార్థులకు సౌలభ్యం కోసం లాంగ్వేజెస్, నాన్ లాంగ్వేజెస్.. ఇలా అన్ని సబ్జెక్టుల్లోనూ ఈ?కంటెంట్‌ను రూపొందించే పనిలో ఎస్‌సీఈఆర్‌టీ నిమగ్నమైంది. ప్రస్తుతం 4వ తరగతి నుంచి నాన్ లాంగ్వేజెస్ సబ్జెక్టులకు బైజూస్ సంస్థ ద్వారా కంటెంట్ అందిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు దానికి ప్రత్యామ్నాయంగా ఎస్‌సీఈఆర్‌టీ అదే తరహాలో ఈ?కంయిటెంట్‌ను సిద్ధం చేయిస్తోంది. నాన్ లాంగ్వేజెస్ సబ్జెక్టులకు మాత్రమే కాకుండా లాంగ్వేజెస్ సబ్జెక్టుల్లో కూడా రూపొందిస్తోంది. పాఠ్యప్రణాళికలను రూపొందించేది ఎస్సీఈఆర్‌టీయే కాబట్టి భవిష్యత్తులో బైజూస్ సంస్థ ఉన్నా, లేకున్నా విద్యార్థులకు ఇబ్బంది రాకుండా ప్రభుత్వం ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా ఈ? కంటెంట్‌ను సిద్ధం చేయిస్తోంది. దీన్ని ఏపీ ఈ?పాఠశాల, యూట్యూబ్, దీక్షా ప్లాట్‌ఫాం, ఐఎఫ్‌పీ ప్లాట్‌ఫాం, పీఎం ఈ?విద్య (డీటీహెచ్ చానెల్)లో అందుబాటులో ఉంచుతారు. ఈ నేపథ్యంలో ఒకే రకుమైన కంటెంట్ ఉండేలా.. ఒకేలా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎమురికి నచ్చినట్లు వారు ఈ?కంటెంట్‌ను రూపొందించి యుట్యూబ్‌లో పెడుతున్నారు. దీనివల్ల విద్యార్థులు కొంత సంశయానికి లోనవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే అన్ని అధికారిక చానెళ్లలో ఎన్‌సీఈఆర్‌టీ, ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన ఈ?కంటెంట్‌ను అందుబాటులో ఉంచనుంది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో 4 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బైజూస్ కంటెంట్ అందుబాటులో ఉంది. అయితే ఇది కేవలం మ్యాథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్‌కు మాత్రమే పరిమితమైంది.

విద్యార్థులు స్మార్ట్ ఫోన్ల ద్వారా ఈ?కంటెంట్‌ను అభ్యసించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అలాగే 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించింది. వీరు 10వ తరగతి వరకు ఈ?కంటెంట్ పాఠ్యాంశాలను ట్యాబుల్లోనే చదువుకోవచ్చు. అయితే బైజూస్ ద్వారా లాంగ్వేజ్ సబ్జెక్టులకు ఈ?కంటెంట్ లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యా, పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌ఈసీఆర్‌టీ) ద్వారా తెలుగు, హిందీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్ సబ్జెక్టులకు కూడా ప్రభుత్వం ఈ?కంటెంట్‌ను సిద్ధం చేయిస్తోంది. ఇందులో భాగంగా ముందు 8వ తరగతిలో లాంగ్వేజ్ సబ్జెక్టులకు ఈ?కంటెంట్‌ను రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియను చేపట్టిన ఎస్‌సీఈఆర్‌టీ మరో రెండు నెలల్లో దీన్ని పూర్తి చేయనుంది. ఆ తర్వాత వరుసగా 9, 7, 6 తరగతులకు రూపొందిస్తారు. 10వ తరగతికి 2024?25లో సిలబస్ మారుస్తామని.. ఆ తర్వాత ఈ?కంటెంట్‌ను రూపొందిస్తామని ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు వివరించారు. వచ్చే ఏడాది నాటికి 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఈ?కంటెంట్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

# కోటంరెడ్డి మాత్రమే యాక్టివ్....



నెల్లూరు, ఏప్రిల్ 11, వైసీపీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలు సస్పెన్షన్ కు గురయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారని వారిపై సస్పెన్షన్ వేటు వేశారు. అయితే నలుగురిలో ఒక్కరు మాత్రమే యాక్టివ్ గా ఉన్నారు. మిగిలిన వారు నియోజకవర్గాలకు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఒక్కొక్కరికి ఒక్కో కారణం. కారణాలు ఏదైనా నియోజకకవర్గానికి దూరంగా ఉంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు కూడా చేపట్టడం లేదు. కానీ నలుగురు సస్పెండ్‌కు గురైన ఎమ్మెల్యేల్లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒక్కరే నియోజకవర్గంలో యాక్టివ్‌గా ఉన్నారు. ఆయన వచ్చే ఎన్నికల్లో అక్కడి నుంచే పోటీ చేసేందుకు అన్ని రకాలుగా సిద్ధమవ్వడంతో అధికార పార్టీకి వ్యతిరేకంగా కార్యక్రమాలను చేపడుతున్నారు.నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాత్రం నియోజకవర్గంలో యాక్టివ్ గా ఉన్నారు. ఆయన ప్రజాసమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతానని చెబుతున్నారు. త్వరలో వంతెన నిర్మాణం కోరుతూ జలదీక్ష చేస్తున్నానని కోటంరెడ్డి ప్రకటించారు. ఇప్పటికే తన సోదరుడు కోటంరెడ్డి గిరధర్ రెడ్డిని తెలుగుదేశం పార్టీలో చేర్చిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాత్రం తాను వచ్చే ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు. కార్యకర్తల సమావేశంలో కోటంరెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు అప్పట్లో వైరల్ అయిన తర్వాతనే వైసీపీ అధినాయకత్వం రూరల్ ఇన్‌ఛార్జిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నియమించింది. ఇక ఆనం రామనారాయణరెడ్డిపై కూడా సస్పెన్షన్ వేటు పడింది. ఆయన తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వెంకటగిరి నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారు. సస్పెన్షన్ వేటు వేసిన నాటి నుంచి హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయం. అదీ టీడీపీ నుంచే. అది కూడా కన్ఫర్మ్. అయితే వెంకటగిరి నుంచి కాకుండా ఆత్మకూరు నియోజకవర్గం నుంచి బరిలోకి దిగాలని ఆనం రామనారాయణరెడ్డి ఆలోచన. టీడీపీ అధినాయకత్వం కూడా ఆత్మకూరులో సరైన నాయకత్వం లేకపోవడంతో ఆనంకు అక్కడే అవకాశమివ్వనుంది. ఈ నేపథ్యంలో ఆయన నియోజకవర్గంలో మాత్రం యాక్టివ్‌గా లేరు. త్వరలోనే ఆయన నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఆయన మరికొన్ని డిమాండ్లను టీడీపీ హైకమాండ్ ముందు ఉంచి సాధించుకునే ప్రయత్నంలో ఉన్నట్లు కనపడుతుంది. ఇక మరో సస్పెండ్‌కు గురైన ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి మాత్రం రాజకీయంగా దూరమయ్యేటట్లే కనిపిస్తుంది. తొలి రోజుల్లో ఉదయగిరిలో కొంత హల్‌చల్ చేసిన మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి తాను ఇండిపెండెంట్ తర్వాత సోదరుడు మేకపాటి రాజమోహన్ రెడ్డి సూచన, హెచ్చరికతో ఒకింత మెత్తపడినట్లే కనిపిస్తుంది. ఆరోగ్యం కూడా తనకు సహకరించడం లేదని, వచ్చే ఎన్నికల్లో పోటీ చే?స్తానో లేదో తెలియదని కూడా చెబుతున్నారు. వరసగా గుండె సంబంధిత జబ్బులు రావడంతో మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు కూడా రాజకీయాలకు స్వస్తి చెప్పమని వత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయన ఈ ఏడాది మాత్రమే ఎమ్మెల్యేగా కొంత హడావిడి చేసి తర్వాత రాజకీయాల నుంచి తప్పుకోవాలని చూస్తున్నారు. ఈ విషయంపై ఆయన త్వరలో సన్నిహితులకు క్లారిటీ కూడా ఇస్తారని తెలిసింది. టీడీపీ కూడా మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిని పార్టీలో చేర్చుకునేందుకు సముఖంగా లేకపోవడమే ఇందుకు కారణంగా చెప్పాలి. శ్రీదేవికి మాత్రం దారి... మరో ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవికి టీడీపీ హైకమాండ్ నిర్ణయం కోసం ఎదురు చూడటం తప్ప మరో దారి లేదు. ఎందుకంటే ఆమెకు నియోజకవర్గంలో తీవ్ర వ్యతిరేకత ఉంది. అందుకే వైసీపీ హైకమాండ్ ఆమెకు సీటు నో అని ముందుగానే చెప్పేసింది. తాడికొండ నియోజకవర్గం టిక్కెట్ టీడీపీ ఇచ్చే అవకాశం లేదు. టీడీపీ ఇప్పటికే పొత్తులు కుదుర్చుకోవడానికి ప్రయత్నిస్తుంది. జనసేన, బీజేపీ, కమ్యునిస్టులతో పొత్తులు కుదిరితే ఉండవల్లి శ్రీదేవికి ఎక్కడా టిక్కెట్ లభించే ఛాన్స్ లేదు. అలా కాకుండా ఒంటరిగా పోటీ చేయాల్సి వస్తేనే ఎదైనా రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి శ్రీదేవికి చంద్రబాబు అవకాశమివ్వవచ్చు. లేదంటే అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్సీ హామీ ఇచ్చి ఆమె చేత కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీకి వ్యతిరేకంగా ప్రచారం చేయించుకోవచ్చు. అంతే తప్ప.. ఉండవల్లి శ్రీదేవికి రాజకీయంగా మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది.

# సామాజిక విప్లవకారుడు పూలే

**ఘనంగా 197వ జయంతి వేడుకలు**

కాకినాడ, ఏప్రిల్ 11 భారతదేశంలో తొలి సామాజిక, సాంఘిక విప్లకారుడు మహాత్మా జ్యోతిరావు పూలేనని ఆయన ఆశయ సాధనకు అందరూ కృషిచేసి ఆయన అడుగుజాడల్లో నడవాలని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. అలాగే మహిళా విద్యకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి తన భార్య సావిత్రిబాయి పూలేను ఉపాధ్యాయునిగా నియమించి ఆదర్శంగా ఆ ఇరువురు దంపతులు నిలిచారని సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి కూడలిలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే 197వ జయంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరైన పిల్లి బోస్ పూలే గురించి వివరించారు. సుమారు 180 ఏళ్ల క్రితం చదువే వెనుకబాటు నుంచి విముక్తి చేయగలదని గ్రహించిన మేధావిగా పూలేని అభివర్ణించారు. ఆ కాలంలో అగ్రవర్ణాలుగా చలామణి అయ్యే మూడు కులాలకు మాత్రమే సకల సౌకర్యాలు, విద్యను పొందే వారన్నారు. ఆ మూడు కులాల వారు మినహా మిగిలిన అందరూ శూద్రులుగానే చూసేవారని, అటువంటి మూఢాచారాలకు వ్యతిరేకంగా ఎన్నో సామాజిక పోరాటాలు నిర్వహించి దేశంలో మహానుభావుడిగా పేరు సంపాదించారన్నారు. పూలే చరిత్రను బ్రిటన్కు చెందిన ఒకరు తెలుసుకొని అతను రచనల ద్వారా పూలే జీవితాన్ని లిఖించారన్నారు. విద్య ఒకటే వెనుకబాటుతనం నుంచి రక్షించగలదని తద్వారానే ఉన్నత స్థితికి రాగలమని నమ్మి అటువంటి దూరదృష్టి కలిగిన మేధావిగా పూలేను పిల్లి బోసు అభివర్ణించారు. అంతకు ముందు బోసుతో పాటు హాజరైన ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న, షేక్ అబ్దుల్ బషీరుద్దీన్, కాకినాడ ఆర్డీఓ కెవి రమణ, బీసీ వెల్ఫేర్ ప్రోగ్రాం ఇన్చార్జ్ టీవీబి ప్రసాద్, ఏబిసిడబ్ల్యూఓ ఎన్ రాజేశ్వరి, కార్పొరేషన్ ఎడిసి సిహెచ్ నాగ నరసింహారావు, బీసీ కార్పొరేషన్ ఎఇఓ జి సత్యనారాయణ, కాకినాడ అర్బన్ తహశీల్దార్ పీవీ సీతాపతి రావు, నాయకులు చొల్లంగి వేణుగోపాల్, సుందరపల్లి గోపాలకృష్ణ, పప్పు దుర్గాప్రసాద్, రాయుడు నాగేశ్వరరావు, రాయుడు దుర్గ, గందం రవి,రాయుడు వెంకటేశ్వరరావు, కండిపల్లి రమణ, పెంకే శ్రీనివాస బాబా, అనుసూరి సతీష్, పంపన మురళి, అల్లి రాజబాబు, బీజేపీ నాయకులు యెనిమిరెడ్డి మాలకొండయ్య, సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, గట్టి సత్యనారాయణ, కుండల సాయికుమార్, చిలుకూరి రామ్ కుమార్, దిలీప్ సదనాని, విశ్వనాధపల్లి సత్యనారాయణ రాజు, కొక్కిలిగడ్డ గంగాధర్, పైడా వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వేణుగోపాల్, గోపాలకృష్ణలు కాకినాడ నగరంలో పూలే భవన నిర్మాణం నిమిత్తం 2017లో 448 గజాలు, 2018లో 2000 గజాలు స్థలం ఇస్తున్నట్లు ప్రకటించారని అది ఆచరణలో అమలు కాలేదని ఎంపీ పిల్లి బోస్ దృష్టికి తీసుకువచ్చారు.

# ఎండ దెబ్బకు పగిలిన కొండ బరువు ఎంతో చెప్పిన అధికారులు

కర్నూలు ఏప్రిల్ 11 జిల్లా గోనెగండ్లలోని ఎస్సీకాలనీలో ఎండల దెబ్బకు పగిలిపోయిన నర్సప్ప కొండ రాయికి అధికారులు కొలతలు వేశారు. కొండరాయి ఆరువేల టన్నుల బరువు, 50 అడుగుల ఎత్తు, 50 అడుగుల వెడల్పు ఉందని అంచనా వేశారు. ఈ కొండ రాయి 500 ఏళ్ల నాటిదని నిర్ధారించారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాగానే తొలగింపు పనులు మొదలుపెట్టనున్నారు.రెండు రోజుల క్రితం నర్సప్ప కొండరాయి ఎండ ధాటికి బాంబు పేలిన విధంగా శబ్ధం చేస్తూ పగిలింది. ఆ ప్రాంతంలో బహిర్భూమికి వచ్చిన కాలనీ వాసులు ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో భయాందోళనకు గురయ్యారు. ఆ తరువాత కొండ పగిలినట్లు గుర్తించిన స్థానికులు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల క్రితం కొండకు వచ్చిన క్రాక్స్ క్రమం క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో కొండ క్రాక్స్ ఏమేరకు పెరుగుతుందనే దానిపై రెవెన్యూ అధికారులు దృష్టిపెట్టారు. కొండను టెక్నికల్ తొలగిస్తేనే ఎలాంటి ప్రమాదం ఉండదని అధికారులు అంచనాకి వచ్చారు. కొండ పక్కనే ఉన్న ఇళ్ల వైపు వాలినట్లు ఉన్న నేపథ్యంలో కొంచెం కదిలించినా ఇళ్లపై పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఇళ్ళ మీద పడే అవకాశం ఉండడంతో ఎస్సీ కాలనీని అధికారులు డేంజర్ జోన్‌గా ప్రకటించారు. కొండ రాళ్ళు పగిలిన ప్రదేశం చుట్టూ ఉన్న 50 ఇళ్లను ఖాళీ చేయించి వారికి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎస్సీ కాలనీవాసులకు గత రాత్రి పునరావాసం కల్పించారు. అయితే ప్రమాదకరంగా ఉన్న బండ రాయిని త్వరగా తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.కాగా... కొండరాళ్ల మధ్య పగుళ్లను సిమెంట్‌తో పూడ్చివేసి.. ఏటవాలుగా వాలిన కొండరాయికి కింది భాగంలో 12 అడుగుల వరకు ఐరన్ పోల్స్ సపోర్టుగా ఉంచి... ఖాళీ ప్రదేశంలో కాంక్రీట్ బెడ్‌తో పూడ్చాలని అధికారులు ఓ నిర్ణయానికి వచ్చారు. కొండ పూడ్చే పనులపై ఉన్నతాధికారుల దృష్టికి ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తీసుకెళ్లారు. ఈరోజు సాయంత్రానికి ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చే అవకాశం ఉందని.. అనుమతులు రాగానే పనులు మొదలుపెడతామని ఆదోని సబ్‌కలెక్టర్ తెలిపారు.

# మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం

నంద్యాల నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్కూర్ గ్రామంలో సింగిల్ విండో చైర్మన్ మద్దూర్ హరి సర్వతం రెడ్డి, బిజ్జల ఉదయ్ కిరణ్ రెడ్డి, గుండ్రాల శ్రీనివాసులు, వంగాల జనార్దన్ రెడ్డి, బిజ్జల రాఘవేంద్ర రెడ్డి, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలను గురించి ఇంటింటికి తిరుగుతూ మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్లను ఇంటి గోడకు అతికించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఎంతో ఉత్సాహం కనపరచి సహకరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు దాసరి ఏసురత్నం, చంద్రకంటి మనో రాజు, వడ్డేమధు, పి. చాంద్, పి.మౌలాలి, బోయ ఈశ్వర్, మరియు వైయస్సార్ పార్టీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# జగనన్న మా భవిష్యత్తు మా నమ్మకం

**వైసీపీ యువ నాయకులు గురునాథ్ రెడ్డి**

కౌతాళం జగనన్న మా భవిష్యత్తు మా నమ్మకం ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి అని వైసిపి నాయకులు గుర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అంటిస్తూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనేక సంక్షేమ పథకాలకు ప్రజలకు విద్యార్థులకు అందించడం జరిగిందన్నారు. ఇందులో అమ్మబడి, రైతు బరోస, జగనన్న తోడు, సచివాలయాలు ఏర్పాటు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు, వీటితో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్కు మరొకసారి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్ను కరపత్రాలను గ్రామ ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో రాఘవరెడ్డి శ్రీనివాసరెడ్డి జైపాల్ సచివాల సిబ్బంది వాలంటీర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు శ్రీశైలంలో కుంభోత్సవం

శ్రీశైలం మంగళవారం శ్రీశైల క్షేత్రంలో లోకకల్యాణార్థం శ్రీ భ్రమరాంబ దేవికి కుంభోత్సవం నిర్వహించారు. ప్రతి సంవత్సరం చైత్ర మాసం లో పౌర్ణమి తర్వాత వచ్చే మంగళవారం లేదా శుక్రవారాల్లో అమ్మవారికి కుంభోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవంలో భాగంగా అమ్మవారికి గుమ్మడి కాయలు నిమ్మకాయలు సాత్విక బలి గా సమర్పిస్తారు అలాగే కుంభహారతి మరియు అమ్మవారికి పలురకాల వంటలతో మహానివేదన సమర్పిస్తారు . దేవాదాయ చట్టం ప్రకారం క్షేత్ర పరిధిలో జంతువులు పక్షులు బలులును పూర్తిగా నిషేధించారు ఆలయ సిబ్బంది స్థానిక రెవెన్యూ పోలీసు శాఖల సహకారంతో జంతు పక్షి బలి జరగకుండా పర్యవేక్షించాలని ఈవో లవన్న ఆదేశించారు. అమ్మవారి ఆలయంలోని అన్ని ఆర్జిత సేవలను, స్వామివారి కల్యాణోత్సవం ,ఏకాంత సేవ నిలుపుదల చేశారు. తరువాత సంప్రదాయాన్ని అనుసరించి స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతిని సమర్పించడంతో ఉత్సవంలోని ప్రధాన ఘట్టం ప్రారంభమవుతుంది. తరువాత రెండో విడత సాత్మిక బలి సమర్పించబడుతుంది.చివరగా అమ్మవారికి ప్రత్యేక పూజలను చేసి పిండివంటలతో అమ్మవారికి మహానివేదన చేయడం జరుగుతుంది. కాగా ఈ ఉత్సవంలో భాగంగానే గ్రామదేవత అంకాళమ్మకు కూడా ఈ ఉదయం ప్రత్యేక పూజలను నిర్వహించారు.

# విశాఖలో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**పలువురు ప్రముఖుల ఘన నివాళి**

విశాఖ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పులే జయంతి వేడుకలు విశాఖలో ఘనంగా జరిగాయి.నగరంలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పులే విగ్రహానికి పలువులు ప్రముఖులు ఘనంగా పూల మాలతో నివాళి అర్పించారు.గ్రీన్ పార్క్ సర్కిల్ వద్ద ఆయన విగ్రహానికి జీవీఎంసీ కమి షనర్ రాజబాబు, విశాఖ జాయింట్ కలెక్టర్ విశ్వనాథం, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి,కాంగ్రెస్ నేతలు,బీజేపీ నాయ కులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యుదయానికి మాత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే కృషి ఫలి తమే నేటి బడుగు జీవుల అభివృద్ధిని కొనియాడారు. అవిద్య, మహిళా సాధికారత, కుల వివక్షలపై తిరుగుబా టు బావుట ఎగరవేసి భారతదేశ సమాజంలో అజ్ఞానాన్ని తరిమికొట్టి బలహీర వర్గాల్లో వెలుగులు నింపారని చెప్పారు.

## వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు సింగరేణి డైరెక్టర్లు

**తెలంగాణ ప్రభుత్వ ఆదేశాలతో విశాఖ చేరుకున్న ప్రతినిధులు**

విశాఖపట్నంఈ బిడ్డింగ్ లో పాల్గొనడానికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే నిర్ణయించారు. ఇందులో భాగంగా మంగళవారం విశాఖ ఉక్కు ప్లాంట్ కు సింగరేణి ప్రతినిధుల బృందాన్ని పంపించారు. ప్రభుత్వ ఆదేశాలతో సింగరేణి కాలరీస్ కు చెందిన ముగ్గురు డైరెక్టర్ల ప్రతినిధి బృందం మంగళవారం విశాఖ చేరుకుంది. అయితే, ప్లాంట్ సీఎండీ ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో ఈ రోజు మార్కెటింగ్ శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులతో తెలంగాణ ప్రతినిధుల బృందం భేటీ కానున్నట్లు తెలుస్తోంది.సింగరేణి కాలరీస్ తో జాయింట్ వెంచర్ కింద ఎక్స్ ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓఐ) సాధ్యాసాధ్యాలను ఈ బృందం పరిశీలిస్తుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# టీడీపీ అందోళన

గూడూరు గూడూరు పట్టణ సమీపంలోని గోగినేనిపురం వద్ద ఉన్న డివిజనల్ విద్యుత్ కార్యాలయం వద్ద కరెంటు చార్జీల పెంపుకు టిడిపి పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ , నాయకులు కార్యకర్తలు నిరసన కార్యక్రమం నిర్వహించారు . ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు . ఈఈ ఇస్మాయిల్ అహ్మద్ కు వినతి పత్రం అందజేశారు . మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో కరెంటు చార్జీలు పెంచలేదని వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఏడుసార్లు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . మరోవైపు ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని దీనివల్ల రైతులు నష్టపోతారని గత టిడిపి ప్రభుత్వంలో ఆక్వా రైతులకు కరెంటు చార్జీలు తగ్గించామని అయితే ఈ ప్రభుత్వంలో చార్జీలు పెంచినందువల్ల ఆక్వా రైతులు నష్టపోతున్నారని తెలిపారు . ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు పులిమి శ్రీనివాసులు ,వెంకటేశ్వర రాజు ,బిల్లు చెంచురామయ్య ,ఇజ్రాయిల్ ,రహీం ,మట్టం శ్రావణి ,తదితరులు పాల్గొన్నారు

